క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చెస్‌లో ప్రతిభ



లింగాల: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి చెస్‌లో(చదరంగం) అంబట్‌పల్లికి చెందిన విద్యార్థులు రాఖేష్(ద్వితీయ), లోకేష్(తృతీయ) స్థానాలలో నిలిచారు. అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అచ్చంపేటలోని అంబట్‌పల్లి జ్యోతిరావుపూలే గురుకులంలో 10వ తరగతి చదువుతున్నారు. ఇద్దరు కూడా కవల పిల్లలు కావడం విశేషం, రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చడం పట్ల సోమవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



తిమ్మాజిపేట: నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎరువుల, విత్తనాల దుకాణాన్నీ ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో క్రిమిసంహారక మందుల నమూనాలను సేకరించారు. వ్యవసాయ అధికారులు సూచించిన క్రిమి సంహారక మందులను రైతులకు విక్రయించి రసీదు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట ఏఈఓ సాయిరాం ఉన్నారు.

తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టి



వెల్దండ: తెగుళ్ల నివాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మండల వ్యవసాయ అధికారిణి శోభారాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలలో కత్తెర పురుగు ఆశిస్తున్నట్లు గుర్తించారు. ఆమె వివరించారు. వాటి నివారణకు క్లోరుంటా నిలిప్రైర్, సల్ఫేనటోరియం మందులను పిచికారీ చేసి నివారించుకోవచ్చన్నారు. అదే విధంగా పత్తిపంటలో రసంపీల్చే పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. పంటలను పరిశీలించి తగిన మందులను పిచికారీ చేసి పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



పెంట్లవెల్లి: విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవురాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎస్సీ బాలుర హాస్టల్ ఎదుట నిల్వ ఉన్న వరద నీటిని పరిశీలించారు. హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేషన్ కష్టాలు తీరేదెప్పుడో?

- 27 గ్రామ పంచాయతీలకు 23 రేషన్ షాపులు
- రేషన్ బియ్యం కోసం అవస్థలు



ఉప్పునుంతలలో రేషన్ బియ్యం తీసుకుంటున్న వినియోదారులు(ఫైల్)

ఉప్పునుంతల: కొత్తగా గ్రామ పంచాయతీలుగా ఏర్పడిన గ్రామాల్లో ప్రజల రేషన్ కష్టాలు మాత్రం తీరడంలేదు. రేషన్ దుకాణాలు స్థానికంగా లేకపోవడంతో సరుకులు తీసుకోవడానికి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలనెలా కిలోమీటర్ల దూరం పొరుగు గ్రామానికి వెళ్లి రేషన్ బియ్యం తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి నెలా కిలోమీటర్లమేర దూరం కాలినడకన, వాహనాలపై వెళ్లి రేషన్ సరకులు తెచ్చుకుంటున్నారు. సరుకుల కోసం మరో గ్రామ పంచాయతీకి వెళ్లడం కష్టంగా ఉందని వినియోగదారులు వాపోతున్నారు. ప్రస్తుతం రేషన్ షాపుల్లో బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. రేషన్ బియ్యం విలువకంటే ఆటో చార్జీలే అధికం అవుతున్నాయని రేషన్ వినియోగదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇటీవల అర్హులైన వారికి కొత్త రేషన్‌కార్డులు ఇచ్చింది. ఈ క్రమంలో మండలంలో కొత్తగా 460 కార్డులు మంజూరీ అయ్యాయి. మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు, 38 ఆవాస గ్రామాలుండగా ప్రస్తుతం 23 రేషన్‌షాపులు మాత్రమే ఉన్నాయి. ఇంతకు ముందు 9724 రేషన్ కార్డులు ఉండగా పెరిగిన కార్డులతో వాటి సంఖ్య 10184కు చేరాయి. వాటిలో పెద్ద గ్రామ పంచాయతీలుగా ఉన్న ఉప్పునుంతల, తాడూరు, వెల్టూర్, పెనిమిళ్ల, కాంసానిపల్లి లో రెండేసి రేషన్ షాపుల చొప్పున పది షాపులు ఉన్నాయి. మిగిలిన 22 గ్రామ పంచాయాతీల పరిధిలో కేవలం 13 రేషన్ షాపులు మాత్రమే ఉన్నాయి.

పొరుగు గ్రామ పంచాయతీకి వెళ్లి సరకులు

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపులు అందుబాటులో లేక పొరుగున ఉన్న గ్రామ పంచాయతీలకు వెళ్లి వినియోగదారులు సరుకులు తెచ్చుకుంటున్నారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీతోపాటు పంచాయతీ పరిధిలోని తిప్పాపూర్ తండాలకు చెందిన వినియోదారులు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడూరు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సివస్తుంది. అదేవిధంగా మొల్గర గ్రామ పంచాయతీకి చెందిన వినియోదారులు పెద్దాపూర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఇక రంగంపేట, కొత్తరాంనగర్, గట్టుకాడిపల్లికి చెందిన గ్రామల వినియోగదారులు ప్రతినెలా ఉప్పునుంతలకు వచ్చి తమ సరకులను తీసుకపోవాలి. అదేవిధంగా ఈరట్యానిపల్లి, లత్తీపూర్ రెండు గ్రామ పంచాయతీలకు చెందిన రేషన్ వినియోగదారులు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న గువ్వలోనిపల్లి గ్రామ పంచాయతీకి వెళ్లి సరకులు తెచ్చుకోవడం ఇబ్బందిగా మారింది. సీబీ తాండ, పూర్యానాయక్ తండా గ్రామ పంచాయతీలకు చెందిన రేషన్ వినియోగదారులు నెలనెలా పెనిమిళ్లకు రావల్సివస్తుందని వాపోతున్నారు. రాయిచెడ్ గ్రామస్తులు ఫిరట్యానిపల్లికి వచ్చి రేషన్ సరుకులు తీసుకెళ్లాల తప్పడం లేదు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న బియ్యం విలువ కంటే రవాణా చార్జీలే అధికమవుతున్నాయని ఆయా గ్రామాల రేషన్ వినియోగదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ విధంగా సరకుల కోసం వెళ్లిన రోజు ఏ ఇతర పని చేసుకోలేని పరిస్థితిలో నష్టపోతున్నామని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కనీసం గ్రామ పంచాయతీల్లో రేషన్ షాపులు ఏర్పాటుచేసి స్థానికంగానే సరకులు అందజేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

రేషన్ షాపును ఏర్పాటుచేయాలి



కొత్తగా ఏర్పడిన తిప్పాపూర్ గ్రామ పంచాయతీలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలి. ఎన్నో ఏళ్ల నుంచి మూడు కిలోమీటర్ల దూరం ఉన్న తాడూరుకు కాలినడకన వెళ్లి సరకులు తెచ్చుకుంటున్నాం. సరకులకు వెళ్లిన రోజు పూర్తిగా వ్యవసాయ పనులు మానుకోవల్సివస్తుంది. అధికారులు స్పందించి ఊళ్లోనే రేషన్ షాపు ఏర్పాటుచేస్తే బాగుంటుంది.

– సునీతాబాయి, తిప్పాపూర్

షాపులు పెరిగే అవకాశం..

మండలంలో కొత్త రేషన్ షాపుల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు మాకు ఎలాంటి నివేదిక అడగలేదు. 400 పైగా రేషన్‌కార్డులు ఉన్న గ్రామాల్లో కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేస్తాం. ఇటీవల పెరిగిన రేషన్‌కార్డులతో మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో కొత్తగా రేషన్‌షాపులు పెరిగే అవకాశం ఉంది.

– పరశునాయక్, డిప్యూటీ తహసీల్దార్ ఉప్పునుంతల

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా



రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి రూరల్: అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కల్వకుర్తి మండలం మార్చాలలో రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభించారు. రూ.10 లక్షలతో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి భూమి పూజ చేసి ఐమాక్స్ లైట్లు ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పేదలకు రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. అదేవిధంగా వన మహోత్సవంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవికుమార్, తహసీల్దార్ ఇబ్రహీం, ఎంపీడీఓ వెంకటరాములు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్, శేఖరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధిపై శ్రద్ధ తీసుకోవాలి



తాడూరులో దళితవాడలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో దళిత వాడల అభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీపీఎం మండల కార్యదర్శి కాశన్న డిమాండ్ చేశారు. సోమావారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మురికి కాల్వలను ఆయన పరిశీలించారు. డ్రెయినేజీ, పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా మరమ్మతు చేపట్టాలని కోరారు. దోమలు ప్రబలకుండా ఫాగింగ్‌తో పిచికారీ చేయాలన్నారు. దళితవాడల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాను నిధులను దళిత వాడలకే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వెంకటస్వామి, వెంకటమ్మ, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

నడింపల్లిలో సీసీ రోడ్లను నిర్మించాలి

అచ్చంపేట రూరల్: మండలంలోని నడింపల్లింలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి సైదులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో దళితవాడ, బీసీ వాడలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గౌరయ్య, భాస్కర్, శ్రీను, నిరంజన్ పాల్గొన్నారు.

కల్వకుర్తి మోటార్లను వెంటనే ఆన్‌చేయాలి

నాగర్‌కర్నూల్: నిలిపివేసిన కల్వకుర్తి మోటార్లను వెంటనే ఆన్ చేయా మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఎక్స్ వేదికగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరారు. సోమవారం శ్రీశైలం జలాశయం నుంచి ఆంధ్రప్రదేశ్ అధికారికంగానే 34,800 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా, తెలంగాణ మాత్రం కేవలం 800 క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 24 మండలాల్లో మొత్తం 447 చెరువులు ఉండగా, 182 చెరువులు 50% కూడా నిండలేదని, 175 చెరువులు 25% మాత్రమే నిండాయని, 90 చెరువులు పూర్తిగా వట్టిపోయాయని అన్నారు. మొత్తం చెరువుల సామర్థ్యం 6.28 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 2.55 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయన్నారు. వనపర్తి జిల్లాలో 222 చెరువులు ఉండగా, 54% చెరువులు ఇంకా నిండలేదని, మొత్తం చెరువుల సామర్థ్యం 8.39 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.23 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయన్నారు. ఇంకా పూర్తి స్థాయిలో రిజర్వాయర్లు, చెరువులు నిండకముందే మోటార్లు ఎందుకు బంద్ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వెంటనే మోటార్లు ఆన్ చేయాలని, ప్రారంభించకపోతే రైతులతో కలిసి ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు.

నేడు వాహనాల వేలం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో మంగళవారం వాహనాల వేలం వేస్తున్నట్లు సీఐ జిల్లెల్ల వెంకటరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ పరిధిలో సారా, నల్ల బెల్లం అక్రమ రవాణా సందర్భంగా వివిధ కేసులలో పట్టుబడ్డ ద్విచక్ర, ఆటో, ఫోర్ వీలర్ వాహనాలను వేలం వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు

వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి పలువురు అధికారులు డుమ్మాకొట్టారు. వ్యవసాయ శాఖ అధికారిణి శోభారాణి, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మలు మాత్రమే హజరైనారు. మిగతా శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఆయా గ్రామాల వచ్చిన ప్రజలు వెనుతిరిగి పోయారు. జిల్లా అధికారులు స్పందించి గైర్హాజరైన అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ: మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అద్దంకి సునీత కోరారు. ప్రజావాణిలో ఎలాంటి దరఖాస్తులు అందలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆచారిపై ఆరోపణలు సరికాదు



కల్వకుర్తి రూరల్: జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిపై ఆరోపణలు సరికావని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, సీనియర్ నాయకుడు రాంభూపాల్ రెడ్డిలు అన్నారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన విజయవంతం కావడంతో కాంగ్రెస్ నాయకుడు మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్ ఓర్వలేక ఆచారిపై ఆరోపణ చేయడం సరికాదన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాబీదేవ్, రాఘువేంద్ర గౌడ్, శేఖర్ రెడ్డి, నరసింహ, రవి గౌడ్, సురేందర్ గౌడ్, గంగాధర్, శివ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టిజన్ మృతి

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో సివిల్ డివిజన్‌లో ఆర్టిజన్‌గా పని చేస్తున్న భారతమ్మ(50) సోమవారం గుండెపోటుతో మృతి చెందింది. విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలడంతో హుటాహుటిన ఆమెను ఈగలపెంటలోని జెన్‌కో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే భారతమ్మ మృతి చెందినట్లుగా ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

యూరియా కోసం రైతుల బారులు



లింగాలలో సింగిల్ విండో కార్యాలయం దగ్గర యూరియా కోసం బారులు తీరిన రైతులు

వెల్దండ: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సోమవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. వర్షాలు రావడంతో ఒక్కసారిగా రైతులు యూరియా కోసం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఒక్కొక్క రైతుకు పాస్‌బుక్, ఆధార్‌కార్డులకు రెండు బ్యాగుల చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు. యూరియా కొరత లేకుండా చూస్తామని పీఏసీఎస్ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఇప్పటి వరకు 450బస్తాల యూరియా అందుబాటులో ఉందని వివరించారు.

లింగలలో..

లింగాల: మండలంలో యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మొక్కజొన్న పంటకు యూరియా వేయుటకు రైతులు తంటాలు పడుతున్నారు.ఎకరాకు రెండు బస్తాల యూరియా మాత్రమే పంపిణీ చేస్తున్నారు. సోమవారం రైతులు మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి భారీగా తరలివచ్చారు.

తాడూరులో..

తాడూరు: మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎకరాకు మూడు బస్తాల వంతున ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు లైన్‌లో గంటల తరబడి నిల్చుంటున్నారు. ఈ విషయంపై ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డిని వివరణ కోరగా ఉమ్మడి జిల్లాలోనే రైతులు యూరియా అధికంగా వాడుతున్నారని వివరించారు. టార్గెట్‌మించి యూరియా రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు.



తాడూరులో యూరియా కోసం సేద తీరుతున్న రైతులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యేలు రాజేష్‌రెడ్డి, వంశీకృష్ణ, నాయకులు

బల్మూర్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం కొండనాగుల-రామాజిపల్లి గ్రామాల మధ్య రూ.3 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యేలు డా.వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా.రాజేష్‌రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. దీంతో పాటు కొండనాగుల గ్రామంలో రూ.1.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన, రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, పీఆర్ డీఈఈ చెన్నయ్య, తహసీల్దార్ శ్రీకాంత్, ఏఈ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, ఆవుల తిరుపతయ్య, గిరివర్ధన్‌గౌడ్, కాశన్న, గోవర్ధన్ సాగర్, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



బిజినేపల్లి మండలం పాలెం కళాశాల విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది



బల్మూరులో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కల్వకుర్తి, బిజినేపల్లి, తిమ్మాజిపేట, తాడూరు, తెలకపల్లి, ఉప్పునుంతల, మన్ననూరు, చారకొండ, లింగాల, బల్మూర్, ఊర్కొండ, దోమలపెంటలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు వైద్యాధికారులు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏడో వార్డులో సైడ్‌డ్రైన్లు నిర్మించాలి

కొల్లాపూర్: పట్టణంలోని ఏడో వార్డులో సైడ్‌డ్రైన్లు నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం వారు వార్డులో పర్యటించారు. సైడ్ డ్రైన్‌లు లేకపోవడంతో మురుగు రోడ్లపైనే నిలుస్తోందని, పలుమార్లు సమస్యను స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. వార్డులో కరెంట్ స్తంభాలు లేకపోవడంతో కట్టెలకు విద్యుత్ వైర్లను ఏర్పాటు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి అవసరమైన చోట్ల మురుగుకాల్వల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు సలీం, వెంకటస్వామి, ఎల్లయ్య, రామకృష్ణ, రాముడు, నాగరాజు తదితరులు ఉన్నారు.

పాఠశాలల బలోపేతానికి పెద్దపీట

వంగూరు: ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థినీ విద్యార్థులకు టై, బెల్ట్, ఐడెంటిటీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. మండల కేంద్రానికి చెందిన విక్టరీ యూత్ ఆధ్వర్యంలో సమకూర్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వంగూరు మండలంలోని వంగూరు, పోల్కంపల్లి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విలీనం చేయడం మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు రమేష్‌గౌడ్, యాదగిరి రావు, జనార్దన్, రమేష్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలు విజయవంతం చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్‌లో 20 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం బాల్‌నర్సింహ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఎండీ ఫయాజ్‌తో కలిసి ఆయన విడుదల చేశారు. రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు, శివుడు, లక్ష్మీపతి, కిరణ్, గోపాల్, గోపిచారి, వెంకటస్వామి, శేఖర్, జిల్లా నాయకులు శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి



కోడేరు: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ కోరారు. సోమవారం మండలంలోని బావాయిపల్లి, పస్పుల వాగు ఉధృతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని రైతులు వాగు అవతలి పొలాలకు వెళ్లొద్దన్నారు. బావాయిపల్లి నుంచి పెద్దకొత్తపల్లి, కోడేరు నుంచి పస్పుల, పెద్దకొత్తపల్లికి ప్రయాణికులు ద్విచక్ర వాహనదారులు రాకపోకల సాగించొద్దన్నారు. అనంతరం ప్రజలకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది మహేష్, తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

మన్ననూర్: స్థానిక ముత్యాలమ్మ తల్లి ఆలయం వద్ద యువకులు సోమవారం శ్రమదానం చేసి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. మరో వారం రోజుల్లో అంబేడ్కర్ కాలనీలో ముత్యాలమ్మ తల్లి బోనాలు ప్రారంభంకానున్నాయి. ఉత్సవాలను పురస్కరించి గ్రామ యువకులు స్వచ్ఛందంగా శ్రమదానం చేశారు. వివిధ పనులను ముమ్మరంగా చేస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు దాసరి వెంకటేశ్వర్లు, వెంకటరమణ, రంజిత్, కృష్ణ, గోపాల్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ



కోడేరు: మండంలోని రాజాపూర్, గుండ్యావాల్యానాయక్ తండాలో మాజీ ఎంపీపీ కొత్తరామ్మోహన్ రావు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో హౌసింగ్‌ఏఈ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి విష్ణు, పాండేళ్ల సురేష్‌యాదవ్, కొండ్రావుపల్లి కుర్మయ్యయాదవ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

వరద నీరు నిల్వ.. ప్రయాణికుల అవస్థలు



తిమ్మాజిపేటలో నిలిచిన నీరు

తిమ్మాజిపేట: జడ్చర్ల-నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి సమీపం నుంచి తిమ్మాజిపేట ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో గుంత ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉంటోంది. దీంతో వాహనాల చోదకులు, పాదాచారులు అవస్థలు పడుతున్నారు. ఇదే దారి గుండా తహసీల్దార్ కార్యాలయానికి, ఎంపీడీఓ కార్యాలయానికి, మండల వ్యవసాయ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావొస్తున్న కనీసం నీళ్ల చేరిన గుంతలో తట్టెడు మట్టి కూడ వేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పాదాచారులు నడవలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి కార్యాలయాలకు వెళ్లే రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీపుకోవాలని పలువురు కోరుతున్నారు.